www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 నవంబర్ 2022

సచివాలయాల హెల్త్ సెక్రటరీలకు ఉద్యోగోన్నతి కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సచివాలయ హెల్త్ సెక్రటరీలకు ఉద్యోగోన్నతి కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలనే సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషనరీ డిక్లేర్ చేసిందని, సర్వేయర్లకు గ్రేడ్ 2 ప్రమోషన్లు కల్పించారని గుర్తు చేశారు. హెల్త్ సెక్రటరీలు సైతం మూడేళ్ల సర్వీసు కాలాన్ని పూర్తి చేసుకున్నారని గుర్తు చేశారు. కోవిడ్ కష్టకాలంలోనూ వీరంతా ప్రజలకు అందించిన సర్వీసును గుర్తించి గ్రేడ్ 2గా ప్రమోషన్ సౌకర్యం వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి...

నల్లజెండాలతో స్వాగతం పలుకుదాం..!

ప్రత్యేక హోదా సాధన సమితి పిలుపు / ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి ద్రోహం చేస్తోందని, బిజెపి మంత్రులకు నల్లజెండాలతో స్వాగతం పలకాలని ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. త్వరలో తిరుపతికి రానున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి నల్లజెండాలతో స్వాగతం పలకాలన్నారు. ఢిల్లీలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న ధర్నాకు మద్దతుగా తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రావడం కోసం ఇదే తిరుపతి నగరంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని నమ్మబలికి దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందన్నారు. ఆంధ్రాకు ఇంత ద్రోహం చేసిన బిజెపి మంత్రులకు ప్రజలంతా నల్లజెండాలతో స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఆంధ్రాకు ఇంత ద్రోహం చేసిన నరేంద్రమోడీ ప్రభుత్వానికి అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి భయపడి ప్రభుత్వ ధనంతో స్వాగతం పలకడం దారుణమన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవమైన విశాఖ ఉక్కు పరిశ్రమను మోడీ ప్రైవేటీకరిస్తున్నా అడగలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ప్రత్యక్షంగా ఆందోళన కార్యక్రమాలు చేశారని, అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం నాలుగేళ్ల తరువాత ఆంధ్రాకు ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేసిందన్నారు. జనసేన నేత పవన్‌కల్యాణ్ ఆనాడు బిజెపి నుంచి బయటకు వచ్చి అది పాచిపోయిన లడ్డు, ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ప్రత్యక్షంగా పోరాటం చేసి ప్రత్యేక హోదా సాధించుకోవాలని పిలుపునిచ్చారని, ఈనాడు మూడు పార్టీలూ నరేంద్రమోడీ పాదాల దగ్గర ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని, అడిగే దమ్ము ఆ మూడు పార్టీలకూ లేదన్నారు. తిరుపతి నగరానికి కేంద్రమంత్రి నితిన్ ఘట్కరీ వస్తున్న సందర్భంగా నల్లజెండాలతో స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి , సిపిఎం నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకష్ణ ,కుమార్ రెడ్డి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నదియా, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర సిపిఎం నాయకులు ఆర్ లక్ష్మి, నరేంద్ర, జయంతి, వేణు, శ్రీనివాసులు, తంజావూరు మురళి, ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్దయ్య, గోపి గౌడ్, మల్లికార్జున్, రామచంద్రయ్య, పార్థసారథి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గూడూరు రూరల్‌లో సిపిఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాఇరు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్, షేక్ కాలేషా పాల్గొన్నారు.

అందరి నోటా 'సంక్షేమ' స్తుతే...!

సమస్యలు పట్టని డిఆర్‌సి

శనివారం కలెక్టరేట్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశం తాము చేసిన సంక్షేమ పథకాల గురించి గొప్పలు చెప్పుకోవడానికి తప్ప, ప్రజల సమస్యలు చెప్పుకోడానికి కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు రబీ ప్రారంభమైనా ఆర్‌బికెల్లో విత్తనాలు, ఎరువులు దొరక్క రైతులు, రహదారులు గుంతలమయమై యాక్సిడెంట్లకు నిలయంగా మారినా, దళిత గిరిజనులు నివసించే ప్రాంతాల్లో సిలికాన్ తవ్వకాలు, క్వారీలు వద్దని మొర పెట్టుకుంటున్నా ప్రజాప్రతినిధుల చెవికెక్కినట్లు లేదు. 'ప్రశ్నించే గొంతుకే' లేకపోవడంతో ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ 'నవరత్నాల' స్తుతి వినిపించి డిఆర్‌సి అయ్యిందనిపించారు. మీడియాకు 'నో ఎంట్రీ' అని చెప్పడంతో అధికార పార్టీకి అడ్డే లేకుండా పోయింది. అడిగిన వెంటనే అధికారులు సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఇవ్వాలని, అధికారులు సంక్షేమ ఫథకాలను పర్యవేక్షించాలని ఒకింత అధికార యంత్రాంగంపై ప్రజాప్రతినిధులు చురకలు అంటించడం తప్ప సమస్యలపై నిలదీసే పరిస్థితి లేకపోవడంతో డిఆర్‌సి సమావేశం మమ అనిపించినట్లయ్యింది.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో పేదల తలరాతలు మారుతున్నాయని, ప్రతి కుటుంబంలో సిఎంను పెద్ద కొడుకుగా భావిస్తున్నారని తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. సమావేశ ప్రారంభంలో భారత రాజ్యాంగ దినం పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు భారత రాజ్యాంగ ప్రస్తావన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణాలలో ఐదో స్థానంలో ఉన్నామని, నాడు-నేడు పథకంలో జిల్లాలో 2,343 పాఠశాలలకు సంబంధించి మొదటి విడతలో 164 కోట్లతో 862 పాఠశాలల్లో వసతులు కల్పించామని, రెండో విడతలో 1079 పాఠశాలల్లో రూ.332 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ జిల్లాలో సచివాలయాల పరిధిలో 437 వైఎస్ఆర్ విలేజి క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత మాసం అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానం ప్రారంభమయ్యిందన్నారు. వంద సంవత్సరాల తరువాత జగనన్న భూహక్కు.. భూరక్ష పథకంతో జిల్లాలోని 69 గ్రామాలలో రీసర్వే చేసి త్వరలోనే రైతులకు పత్రాలు అందించనున్నామన్నారు. నరేగా నిధులకు సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ జిల్లాలో టూరిజం కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. జడ్‌పి ఛైర్మన్ (ఉమ్మడి జిల్లా) శ్రీనివాసులు మాట్లాడుతూ రెండో విడత నాడు-నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రజాప్రతినిధులచే చేపట్టగలిగితే మరింత మెరుగ్గా నిం ా ్మ ణ ా ల ం సాగుతాయన్నారు. తిరుపతి ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ సమాచారం కోరిన వెంటనే అధికారులు ఆలస్యం లేకుండా ప్రజాప్రతినిధులకు అందించాలన్నారు. సిఎస్ఆర్ నిధులతో ల్యాబ్ ఫెసిలిటీస్ పెంచేలా చూడాలన్నారు. దివ్యాంగులకు జారీ చేస్తున్న ధృవపత్రాలను తాత్కాలికంగా అందిస్తున్నామని, వాటిని పూర్తిస్థాయిలో అందించేలా వైద్యశాఖ చూడాలన్నారు. ఎంఎల్‌సిలు వాకాటి నారాయణరెడ్డి, బల్లికల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ టిడ్కో గృహాలను త్వరితగతిన లబ్దిదారులకు ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించిన వంతెలన ప్రతిపాదనలు, కృష్ణపట్నం పోర్టుకు రహదారుల అనుసంధానం చేపట్టాలన్నారు. 2001లో ఎస్‌టిలకు గృహాలను మంజూరు చేశారని, అవి శిథిలావస్థకు చేరుకున్నాయని కొత్త గృహాలు మంజూరు చేయాలని కోరారు. చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు 148 జీవో మేరకు అడిగిన సమాచారం త్వరగా అధికారులు అందించాలన్నారు. శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు తరచూ పర్యటించి పథకాల పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్యశాఖ పనితీరు మరింత మెరుగుపడాలన్నారు.

వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి అసైన్ ల్యాండ్ జగనన్న కాలనీలకు అడిగిన వెంటనే పరిహారం లేకుండా వెంకటగిరిలో 97 ఎకరాలను తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పినా దాదాపు 200 మందికి రెండు సెంట్లు వంతున అందించగలిగితే మానవత్వం చాటుకున్న వాళ్లమవుతామని అన్నారు. టిడ్కో ఇళ్ళకు సంబంధించి రెండవ దశ వాటిని నిర్దేశించిన మార్చి 2023 కు కాకుండా త్వరగా అందించగలిగితే లబ్దిదారులకు మేలు కలుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జేసి. డి.కె. బాలాజీ, నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, డి.ఆర్.ఓ. శ్రీనివాసరావు, ఆర్.డి.ఓ లు తిరుపతి కనకనరసా రెడ్డి, సూళ్ళూరుపేట రోజ్ మాండ్, గూడూరు కిరణ్ కుమార్, శ్రీకాళహస్తి రామారావు, ముఖ్య ప్రణాళికా అధికారి అశోక్ కుమార్, పి.డి. హౌసింగ్ చంద్రశేఖర్ బాబు, మెప్మా పి.డి. రాధమ్మ, డి.ఈ.ఓ. శేఖర్, ఎల్.డి.ఎం శుభాష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కన్నపేగును చంపుకున్న మూర్ఖత్వం

క్షణికావేశంలో పసికందును గోడకేసి బాదిన తండ్రి

శ్రీకాళహస్తిలో విషాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తల్లిదండ్రుల మూర్ఖత్వం ముక్కుపచ్చలారని మూడు నెలల పసికందు నిండు ప్రాణాలను బలిగొంది. క్షణికావేశంలో కన్నబిడ్డను గోడకేసి కొట్టి ప్రాణం తీసిన విషాద ఘటన శుక్రవారం రాత్రి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం వాటర్ వర్క్స్ కాలనీలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం వేడాం మిట్ట కండ్రిగ గ్రామానికి చెందిన అనిల్ (అలియాస్ మునిరాజా), స్వాతి ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి మూడు నెలల బాబు నిఖిల్ ఉన్నాడు. అనిల్ పెయింటర్ గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్వాతి గృహిణిగా ఉంటూ కుటుంబ ఆలనా పాలనా చూసుకుంటోంది. ఈ క్రమంలో అనిల్ పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి వాటర్ వర్క్స్ కాలనీలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో మూడు నెలల అఖిల్ గుక్క పట్టి ఏడ్వడం గమనించి ఆస్పత్రికి తీసుకెళ్దామని భార్యతో అన్నాడు. ఈ క్రమంలో భార్య భర్తల మధ్య వివాదం నెలకొంది. తన మాటే ధిక్కరిస్తోందన్న కోపంలో అనిల్(అలియాస్ మునిరాజా) పసికందు అఖిల్ ను గోడకేసి బాదాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారాన్ని వన్ టౌన్ పోలీసులకు అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అంజూ యాదవ్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాందేవ్‌బాబాను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

తిరుపతి టౌన్ : మహిళలను అవమానసరుస్తూ వ్యాఖ్యలు చేసిన రాందేవ్‌బాబాను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. తక్షణమే కేసు నమోదు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా మహిళలను ఉద్దేశించి 'చీరల్లో, సూట్, సల్వార్‌లలో బాగుంటారని, తనకైతే ఏమీ వేసుకోకున్నా బాగుంటారు' అని మహిళలను కంచపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇటీవల కాలంలో మహిళల పట్ల అవమానకరంగా రాందేవ్‌బాబా, గరికిపాటి లాంటి వ్యక్తులు చేస్తున్న వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయన్నారు. జాతీయ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసును తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నదియా, జయంతి పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణలో తిరుపతి మొదటి స్థానం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భవన నిర్మాణాలు క్రమబద్ధీకరించేందుకు సకాలంలో అనుమతులు ఇవ్వడంలోనూ, లేఔట్ల క్రమబద్ధీకరణలోనూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కన్నా తిరుపతి మొదటిస్థానంలో ఉందని కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. అదనపు కమిషనర్ సునీతతో కలిసి కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగంతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా భవనాలు నిర్మించుకొని సరైన అనుమతులు రాకుండా పెండింగులో వుండిపోయిన భవనాలను క్రమబద్ధీకరించే విషయంలో (బి.పి.ఎస్) ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లడం వలన గడిచిన మూడు సంవత్సరాల్లో 1408 క్రమబద్ధీకరణ అనుమతులు కొరకు స్వీకరించిన దరఖాస్తుల్లో 1226 దరఖాస్తులను ఆమోదించడం ద్వారా 21 కోట్లు కార్పొరేషన్ కి ఆదాయం సమకూరిందన్నారు. లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్.ఆర్.ఎస్) విషయానికి వస్తే గడిచిన రెండు సంవత్సరాల్లో 678 లే అవుట్లను అధికారికంగా గుర్తించడం ద్వారా 15 కోట్ల 23 లక్షల రూపాయలు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కి రావడం జరిగిందన్నారు. ఇక ఆన్ లైన్ బిల్డింగ్ పర్మిషన్ల కొరకు 2021లో 556 దరఖాస్తుల దారుల నుంచి 13 కోట్ల 32 లక్షల రూపాయాలు రాగా, 2022 నాటికి 577 దరఖాస్తుల ద్వారా 18 కోట్ల 33 లక్షల రూపాయాలు కార్పొరేషన్ కి ఆదాయం సమకూరడం అధికారులు, సిబ్బంది కషేనని ఆమె ప్రశంసించారు. తిరుపతి నగరపాలక సంస్థ అభివద్ధి పనితీరు రాష్ట్రంలో ఓ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోవడం అందరి సమిష్టి పనితీరుకు ఉదాహరణగా నిలుస్తుందన్నారు. అడ్వర్టైజింగ్ రూపంలో గత సంవత్సరం 61 లక్షల 18 వేలు రాగా, ఈ సంవత్సరం 1కోటి 43 లక్షలు రావడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సిబ్బందికి అభినందనలు తెలియజేసారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులపై, అదేవిధంగా పట్టణ ప్రణాళిక విభాగం పని తీరులో ఇప్పటికే ఇద్దరు అసిస్టెంట్ సిటి ప్లానర్లు, ఇద్దరు సర్వేయర్లు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్లు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్లు, 94 మంది సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పని చేస్తున్న విషయాన్ని అదనపు కమిషనర్ సునీత తెలియజేయగా, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ శ్రమకు తగ్గ పలితాన్ని ప్రజలకు అందించేలా అందరూ కలిసి పని చేద్దామన్నారు.

గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ డిస్‌ప్లే కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎక్స్‌-టీరియర్ తిరుపతి వద్ద ఎల్.వి. ఎంటర్‌ప్రైజెస్ లో తన మొట్టమొదటి డిస్‌ప్లే కేంద్రాన్ని ప్రారంభించింది. స్థానిక పాత రేణిగుంట రోడ్, రిలయన్స్ మార్ట్ వెనుకవైపున, శ్రీనివాస ఐస్ ఫ్యాక్టరీ పక్కన ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద ఆ సంస్థ హెడ్ అనోద్ సంగాల్ మాట్లాడుతూ గ్రీన్‌లామ్ ల్యామినేట్స్ వివిధ రకాల ల్యామినేట్ డిజైన్లను డిస్‌ప్లే చేస్తుందన్నారు. ఈ కేంద్రముతో, అత్యున్నత నాణ్యతా గీటురాళ్ళు, ఆకట్టుకునే కొత్త, ప్రత్యేకితమైన ప్రోడక్ట్ డిజైన్లు, రంగులు ఆకట్టుకునేలా ఉంటాయన్నారు. గ్రీన్‌లామ్ అనేది, నాణ్యత, చక్కదనానికి హాల్‌మార్క్ లాంటిది అన్నారు. వినియోగదారుల డిజిటల్ అవసరాల నాడిని పసిగడుతూ, వినియోగదారులు నేడు పెద్దగా కొనుగోలు చేయడానికి, ముందుగా ప్రొడక్టును తాకి చూసి అనుభూతి చెందడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మనోభావనపై తిరుపతిలో మొట్టమొదటి గ్రీన్‌లామ్ ల్యామినేట్స్ ఎస్ ఐ ఎస్ డిస్‌ప్లే ని ప్రారంభించడం అనేది కస్టమర్ల సంతప్తి సాధన దిశగా తమ మొట్టమొదటి అడుగు అవుతోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్.వి. ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు టి. బాలా ప్రసాద్, గ్రీన్‌లామ్ ల్యామినేట్, అనుబంధ విభాగాల ప్రాంతీయ అధిపతి శ్రీనివాస చక్రవర్తి, చుండూరు బ్రాంచ్ అధిపతి ఖలీల్ షేక్, ప్రముఖ రూపశిల్పులు, ఇంటీరియర్ డిజైనర్లు, కాంట్రాక్టర్లు, డీలర్లు పాల్గొన్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో...

ఆకట్టుకున్న చిడతల రామాయణం

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సూర్యప్రభ వాహన సేవలో చిడతల రామాయణం, చిత్తూరు డ్రమ్స్, ఒలియట్యం కళాప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ కు చెందిన కళాకారులు సీతారాములు, లక్ష్మణుడు, జనకుడు, కౌసల్య, ఆంజనేయులు, రావణుడు వాలి సుగ్రీవులు విశ్వామిత్రుడు తదితర వేషధారణలు ధరించి చిడతలతో రామాయణ గానం చేశారు . చిత్తూరుకు చెందిన శ్రీరంగడు డ్రమ్స్ బందం కళాకారుల డ్రమ్స్ వాయిద్యం భక్తులను ఆకట్టుకుంది. తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన కళాకారులు తమిళనాడు గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయ ఒలియట్యం నత్యం ప్రదర్శించారు. అదేవిధంగా హైదరాబాద్, విశాఖపట్నం తూర్పుగోదావరి, బొబ్బిలి, తిరుపతికి చెందిన 14 భజన బందాల కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నత్యం, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి.

చిర్ల జగ్గిరెడ్డి పాదయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరో 30 ఏళ్ల పాటు రాష్ట్రంలో పాలన కొనసాగించాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తిరుమల నుంచి శ్రీశైలం వరకూ పాదయాత్రను శుక్రవారం తిరుపతిలో ప్రారంభించారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి ఆర్‌కె రోజా, ఎంపి గురుమూర్తి, ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష ఈ పాదయాత్రకు సంఘీభావం ప్రకటించి పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రసాద్‌రెడ్డి ఆకాంక్ష నెరవేర్చడానికి తిరుమల నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర చేపట్టినట్లు చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. తిరుమల నుంచి 370 కిలోమీటర్ల మేర శ్రీశైలం వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అభిమాని మల్లిడి ప్రసాద్‌రెడ్డి కొత్తపేట నియోజకవర్గం నుంచి మూడుసార్లు తిరుమలకు పాదయాత్రగా వచ్చారని, అనుకోని విధంగా ప్రసాద్‌రెడ్డి మరణించారని, ఆయన ఆకాంక్ష నెరవేర్చడానికి ఈ పాదయాత్ర చేపట్టామన్నారు.

ఊరు వాడ 'దొంగ'మద్యం

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

జిల్లాలో ఊరూ వాడా దొంగ మద్యం విచ్చలవిడిగా పారుతోంది. 'ఇందు కలదు.. అందు కలదు..' అనే తీరులో ఎక్కడ చూసినా ఏరులైపారుతోంది. ముఖ్యంగా కర్నాటక, తమిళనాడు నుంచి పెద్ద మొత్తంలో మద్యం తరలుతోంది. ఇటీవల కాలంలో అధికార పార్టీ నాయకులే ఈ దందాలో దిగుతున్నారు. పేదలకు మద్యంపై ఉన్న పిచ్చిని వీరు సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లకు పడగలెత్తుతున్నారు. మన రాష్ట్రంలో మద్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇదే పొరుగు రాష్ట్రాలపైన కర్నాటక, తమిళనాడులో మద్యం ధరలు తక్కువగాఉంటున్నాయి. దీంతో ఆ ప్రాంతాల నుంచి కొందరు మాఫియా లాగా మారి విచ్చలవిడిగా మద్యాన్ని తరలిస్తున్నారు. ఒకోసారికి వంద కేసులకు రూ. లక్షకు పైగా మిగులుతోంది. దీంతో సులభంగా వచ్చే సొమ్ము కాబట్టి వీరు పోలీసుల కళ్లు గప్పి విచ్చలవిడిగా తరలిస్తున్నారు. స్తోమత ఉన్న వారు కర్ణాటకకు వెళ్లి తాగడం అక్కడి నుంచి తెచ్చుకోవడం చేస్తున్నారు. సామాన్యులు మాత్రం అక్కడి నుంచి వచ్చే వారి దగ్గర నుంచి కొంచెం ఎక్కువగా పెట్టి కొనుగోలు చేసి తాగుతున్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు వంటి ప్రాంతాల్లో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. తాను అధికారంలోకి వచ్చాక మద్యనిషేధాన్ని అమలు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సభలోనూ చెప్పేవారు. ఇప్పుడు దొంగ మద్యం జిల్లాలో ఏరులై పారుతోంది. రామకుప్పం మండలంలో ప్రభుత్వ దుకాణం లేదు. ఇక్కడ కర్నాటకకు సరిహద్దు కావడంతో ఈ మండలం మొత్తం దొంగ మద్యం ఏరులైపారుతోంది. కొన్ని ప్రాంతాల్లో రహస్యంగా, మరి కొన్ని ప్రాంతాలలో బహిరంగంగా సాగుతోంది. ఇలా మద్యం తాగడం వల్ల పేదల కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి. కూలీ నాలీ చేసుకునే వారు వారి సంపాదనను మొత్తం దీనికే వెచ్చిస్తున్నారు. ఇంట్లో వస్తువులు లేకపోయిన కష్టపడి సంపాదించిందంతా తాగుడుకే తగలేస్తున్నారు. అటు ప్రభుత్వ దుకాణాలు, ఇటు దొంగ మద్యం వ్యాపారుల వల్ల పేదల కుటుంబాలు బలౌవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా వెంటనే మద్యనిషేధాన్ని ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్కెట్లోకి సరికొత్త ఇన్నోవా హైక్రాస్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) ఇన్నోవా హైక్రాస్ అనే ఒక సెల్ఫ్ చార్జింగ్ గల శక్తివంతమైన హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఎస్హెచ్ఐవీ) ని ప్రవేశపెడుతూ ఇన్నోవా ప్రయాణంలో కొత్త శకానికి నాంది పలికింది. శక్తివంతమైన హైబ్రిడ్ ఎలక్ట్రిక్ సిస్టమ్ తో టీఎన్ఏ 2.0 లీటర్ 4 సిలిండర్ల గాసోలిన్ ఇంజిన్ , ఇడ్రైవ్ సీక్వెన్షియల్ షిఫ్ట్ తో మోనోకాక్ ఫ్రేంతో 137 కిలోవాట్ (186 పీఎస్) గరిష్ట పవర్ ఔట్పుట్ని అందిస్తుంది . ఇది వేగవంతమైన యాక్సిలరేషన్ , సెగ్మెంట్ ఫ్యూయల్ ఎకానమీలో అత్యుత్తమంగా ఉంటుంది . టీఎన్ఏ 2.0 లీటర్ 4 సిలిండర్ గ్యాసోలిన్ ఇంజిన్ని ఎంపిక చేసిన గ్రేడ్ ల్లో డైరెక్ట్ షిఫ్ట్ సీవీటీ కలిగి ఉండి 128 కిలోవాట్ల (174 పిఎస్ ఔట్పుట్ని అందిస్తుంది . కుటుంబ అవసరాల కోసం డిజైన్ చేసిన , ఫీచర్ లోడ్ చేసిన కొత్త ఇన్నోవా హైక్రాస్ గ్లామర్ , దఢత్వం , సౌకర్యం , భద్రత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండి అన్ని సందర్భాల్లో ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా టయోటా , ఇన్నోవా చీఫ్ ఇంజనీర్ హిడెకి మిజుమా మాట్లాడుతూ ఈ ఫీచర్ ప్యాక్ వాహనం ప్రయాణించేటప్పుడు భద్రత , సౌకర్యాన్ని కోరుకునే వారి కోసం తయారు చేశామన్నారు. వైస్ ఛైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

వాడవాడలా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

రాజ్యాంగం గొప్పతనాన్ని, స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన కర్తవ్యం అందరిపై ఉందని వక్తలు ఉద్ఘాటించారు. 'భారత రాజ్యాంగ దినోత్సవం' పురస్కరించుకుని వాడవాడలా రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్‌ను స్మరించుకుంటూ రాజ్యాంగం గొప్పతనాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో డిస్కం కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు వివిఎన్ బాబు, ఎన్‌వివిఎస్ సుబ్బరాజు, కె.శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవలను కొనియాడారు. సమాజంలో ప్రజలందరికీ సమానంగా సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధికి అవకాశాన్ని కల్పించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగ రూపకల్పన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, వై.లక్ష్మీ నరసయ్య, కెఆర్ఎస్ ధర్మజ్ఞాని, జాయింట్ సెక్రటరీ రాధా, జయశ్రీ పాల్గొన్నారు ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలలో లయన్స్‌క్లబ్ తిరుపతి అధ్యక్షులు, ఎస్‌టియు తిరుపతి జిల్లా కార్యదర్శి బి.మునిక్రిష్ణనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు విద్యార్థులకు ఉచితంగా ఐదువేల రూపాయల విలువ చేసే స్టేషనరీని అందించారు.

చిన్నగొట్టిగల్లులో అంబేద్కర్ చిత్రపటానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గురుశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. పుత్తూరులో అంబేద్కర్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ సేవలు చాలా గొప్పవని రిటైర్డ్ జడ్జి దొరస్వామి అన్నారు. సబ్‌రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, రాజేంద్ర పాల్గొన్నారు. కోట మండలంలోని శ్రీ చైతన్య స్కూల్లో ప్రిన్సిపాల్ వెంకట సుధీర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ హక్కులను విద్యార్థులకు వివరించారు. హక్కులనే కాకుండా బాధ్యతలనూ విద్యార్థులు నెరవేర్చాలన్నారు. డీన్ శివయ్య, ప్రైమరీ కోఆర్డినేటర్ హిమబిందు పాల్గొన్నారు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మండలంలోని నాయకులు అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్‌వి రమణయ్య ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్‌ఆర్‌పురంలో 'ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన హమారా భారత్ మహాన్' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. హెచ్‌ఎం పుష్ప పాల్గొన్నారు. కెవిబిపురంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు ఎస్.నరేంద్రబాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. గూడూరులో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుక జరిగింది. మాజీ ఎంఎల్‌ఎ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అణగారిన కులాల్లో పుట్టిన వారు రాజ్యాధికారంలో భాగస్వాములు అయ్యే అవకాశం రాజ్యాంగం వల్లే కలిగిందన్నారు. బిఎన్ కండ్రిగ బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంలో వసతి గృహం అధికారి ఎస్.రామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు దుప్పట్ల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జడ్‌పిటిసి ఆరని ప్రతిమారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ భారతదేశానికి రాజ్యాంగం గుండెకాయ వంటిదని, ప్రపంచ దేశాల్లోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగమని వివరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నాదెండ్ల మురళి ఆధ్వర్యంలో పిల్లలచే సాంఘిక శాస్త్ర ప్రయోగ ప్రదర్శనలు ఆకట్టుకోగా, మాక్ పార్లమెంట్ అబ్బురపరచింది. పిచ్చాటూరులో వైకాపా మండల కన్వీనర్ కెటి హరిచంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రేణిగుంటలో ఆశా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జూలియస్‌రాజు ఆధ్వర్యంలో చేపల మార్కెట్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైఎస్ఆర్‌సిపి పట్టణ అధ్యక్షులు ప్రభాకర్ హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు. పుత్తూరు అంబేద్కర్ కూడలిలో మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ హరి, కెనడి ఆధ్వర్యంలో జరిపారు. ఎస్వీయూ బిఆర్ అంబేద్కర్ స్టడీసెంటర్, లా డిపార్టుమెంట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. జాతీయ సమైక్యతను, జాతీయతా భావనను, సమానత్వ భావనను దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్‌రాజ్యాంగ నిర్మాణం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సావిత్రమ్మ, పాలకమండలి సభ్యులు ద్వారకనాథ రెడ్డి , మధు, ఆచార్య దామోదరం, కుల్లాయమ్మ పాల్గొన్నారు. వివిధ రకాల సందేహాలను నివత్తి చేసేవిధంగా రాజ్యాంగంలో పొందుపర్చారని వివరించారు. రాజ్యాంగంలోని ప్రతి అక్షరం అందరికీ శిరోధార్యమన్నారు.తోటి ఉద్యోగులందరు వ్యక్తిగత భాధ్యతగా విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి వ్యక్తి గౌరవాన్ని కాపాడేవిధంగా పనిచేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పంటకు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాలని బాలాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మహిళా యూనివర్సిటీలో ముఖ్య అతిథులుగా డాక్టర్ వి.మురళికృష్ణ పాల్గొని ప్రసంగించారు. మనోజ్‌కుమార్, మాధురి పరదేశి, సీతాకుమారి, సునీత, ఇందియా ప్రియదర్శిని పాల్గొన్నారు. రాయలసీమ బీసీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కల్లూరు నారాయణ గౌడ్ సమోంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తొట్టంబేడు వైసిపి మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు ఆధ్వర్యంలో బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు దుప్పటుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌డబ్ల్యుఒ ఎస్.చంద్రశేఖర్, వార్డెన్ విజయకుమారి, ఎం.రేణుక పాల్గొన్నారు. సత్యవేడులో వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోటలో...

ఎస్‌వియు క్యాంపస్‌లో..

సత్యవేడులో..

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి ఆర్.కె.రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రజా పరిష్కారమే మన ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్ కెరోజా పేర్కొ న్నారు. నింద్ర మండలం నెట్టేరి గ్రామంలో శనివారం "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వహించారు. నెట్టేరి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి మంత్రి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, మురికి కాలువలు వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నింద్ర మండలం ఎంపీపీ, దీప, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు, జయశ్రీ శ్యామ్ లాల్. ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనిల్. సత్తిరాజు. కార్యకర్తలు, మండలం అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఆర్కే రోజా

ఎస్వీసీఈలో ఎలైట్-2022 వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో నిపుణత కలిగిన వారికి నేడు, రానున్న రోజుల్లో మంచి అవకాశాలున్నాయని ఎస్వీసిఈ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఎస్వీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు ఎలైట్-2022 అసోసియేషన్ (ఐఎస్టిఈ) ప్రారంభోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ నిపుణుల ఆవశ్యకత భవిష్యత్తులో మెండుగా ఉందన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రులకు నైపుణ్యంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ చాలా ముఖ్యమన్నారు. ఎస్వీ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో యాజమాన్యం విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా అనేక శిక్షణా తరగతులు, నైపుణ్యాభివృద్ధి కార్యశాలలు, హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహు మతులు ప్రదానం చేసారు. ఎలక్ట్రికల్ విభాగా ధిపతి డాక్టర్ లక్ష్మీదేవి, ప్రోగ్రాం ఇంచార్జి డాక్టర్ షైక్ రఫీ కిరణ్, డాక్టర్ కాసా సుధీర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుధాకర్ రెడ్డి

పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం , శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం తిరుపతి, నార్క్, హైదరాబాద్ వారి సహ కారంతో పెరటికోళ్ల పెంపకంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మూడురోజుల శిక్షణా కార్యక్రమానికి ప్రారంభోత్సవంలో భాగంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. వి. రవి, విస్తరణ సంచాలకులు డా . జి . వెంకటనాయుడు, పరిశోధన సంచాలకులు డాక్టర్ సర్జన్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ సేవలని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమ నిర్వాహణ కర్త డా. కె. సుజాత రైతులని ఉద్దేశించి ప్రసంగిస్తూ మహిళా రైతులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా వారి కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మొదటి రోజులో భాగంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డా . యస్. షకీలా, జి . గంగరాజు, తిరుపతి రెడ్డి, డా.జి. వేణి పెరటి కోళ్ల పెంపకంలో మెళకువలు , వ్యాపార పరంగ కంజు పిట్టల పెంపకం , గ్రుడ్ల పెట్టి కోళ్ల యాజమాన్యం మరియు పెరటికోళ్ల పెంపకంలో ఆదాయ వ్యయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డా.కె.వీరబ్రహ్మయ్య, పరిశోధన సంచాలకులు డా.కె. సర్జన్ రావు, పాలక మండలి సభ్యులు డా.కె. అదిలక్ష్మమ్మ, ఉపకులపతి శ్రీరామ భగవతి రామయ్య, ఆర్గనైజేషన్ సభ్యులు, మునిరత్నం, పాల్గొన్నారు.



4న ఐఎన్‌టీయూసీ నూతన కార్యవర్గ ప్రమాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డిసెంబర్ 4న తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్‌లో ఐఎన్‌టీయూసీ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని, విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రత్న కుమార్ జనరల్ సెక్రటరీ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ బలోపేతంలో భాగంగా మూడు జిల్లాల నూతన కమిటీ పరిచయం, సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్ర కమిటీ పిలుపుమేరకు డిసెంబర్ నెలలో అన్ని కార్మిక సంఘాలను ఏకమై ఢిల్లీలో ఓ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో తగు నిర్ణయాలు తీసుకొని ఉద్యోగులు కార్మికుల సమస్యల పరిష్కారానికి తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రవణప్ప, వీరభద్ర పాల్గొన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి 'గ్రీవెన్స్'

ప్రజాశక్తి-కోట : అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తిరుపతి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆఫీసులో గ్రీవెన్స్ జరుగుతుందని సలహా మండలి సభ్యులు దీవి అనంతబాబు తెలిపారు. కోట మండలం సిద్దవరం గ్రామం శ్రీ కల్యాణ రామాలయంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ ధర్మామదాయ శాఖలో ఉన్నటువంటి ఆలయాల అర్చకులు వంశ పారపర్య హక్కులను కాపాడుకోవడం కోసం వారి వారసుల పేర్లను రికార్డులలో నమోదు చేయించుకోవడం, గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయాన్ని అందించడం, ఉపనయనాలు, వివాహాలు చేసుకున్నటువంటి వారి పూర్తి వివరాలు తెలిపియన ఎడల వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తామని తిరుపతి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పుట్టా రామకృష్ణారెడ్డి తెలిపారన్నారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లోని 'డి' బ్లాక్ ఏడో అంతస్తులోని ఎండో మెంట్ ఆఫీసులో సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. అర్చకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిజర్వేషన్ల అమలులో..

'ముఖ్యమంత్రి నిర్ణయాలు అద్భుతం'

ప్రజాశక్తి-చిల్లకూరు: రిజర్వేషన్ల అమలులో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు అద్భుతమైనవని ఎమ్మెల్యే వరప్రసాదరావు ఉద్ఘటించారు. శనివారం ఆయన చిల్లకూరు మండలం పేరూరు గ్రామంలో పిఏసిఎస్ ఛైర్మన్ నాగరాజు, వారి సతీమణి ఎంపిటీసీ మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్తీక మాసం వనభోజన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాలంలో తన మంత్రివర్గంలో 50 శాతం బీసీలకు కేటాయించడం చరిత్రలో చెప్పుకోదగ్గ విషయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో చిల్లకూరు జెడ్పిటిసి మన్యం సీనయ్య, వాకాడు జెడ్పిటిసి నాయకులు, గూడూరు ఏజెన్సీ ఏఎంసీ ఛైర్మన్ యమునా, చిట్టేటి నారాయణ, ఓడూరు సర్పంచ్ శారదమ్మ, ముదిరాజ్ రాష్ట్ర పో రేట్ ఛైర్మన్ ముదిరాజ్ యాదవ్, కోట భక్తవత్సల రెడ్డి తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని వేదవ్యాస స్కూల్ చింతలకుంట దగ్గర రహదారి అధ్వానంగా ఉందని, ఆ దారిలో వెళ్లాలంటే కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డులో సుమారు 500 మంది విద్యార్థులు రోజు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి రోడ్డులో గత మూడు రోజులుగా నడుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ తప్పిదమా లేక ట్రాక్టర్ డ్రైవర్ల తప్పిదమా అని స్థానికులు అంటున్నారు. ట్రాక్టర్ తీసుకెళుతున్న గుల్ల కింద పడిపోవడంతో ఇలా తయారయిందని, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆ రోడ్డులో నడవలేకపోతున్నామని అంటున్నారు. సంబంధిత అధికారులు ఈ రోడ్డుపై ఉన్న జల్లిని తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అద్దెబస్సులు ఆపాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-వెంకటగిరి: అద్దెబస్సులను ఆపాలని ఏపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు హెచ్చ రించారు. డిపో ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రోజు రోజుకు అద్దె బస్సులను పెంచుకుంటూ పోవడం కార్మికులకు మంచిది కాదన్నారు. ఆర్టీసి యాజమాన్యం 2020 మరియు 2021 సంవత్సరానికి ఉద్యోగ కార్మికులకు ఇవ్వవలసిన లీవ్ ఎన్‌కాష్‌మెంట్ తక్షణమే చెల్లించాలన్నారు. 2017 సంవత్సరం 2019 సంవత్సరాల లీవు ఎన్‌క్యాష్ మెంట్ చెల్లింపు బకాయిలు నేటికి చెల్లించలేదన్నారు. ఆర్టీసీ ప్రభుత్వం విలీనమైన అద్దె బస్సులు రావడం ఆగడం లేదన్నారు. విలీలనమైనప్పటి నుండి మరింతగా అద్దెబస్సులను పెంచుతున్నారన్నారు. ప్రభుత్వ బడ్జెట్లో కేటాయించిన 408కోట్ల రూపాయిలతో యాజమాన్యమే కొత్త బస్సులను కొనవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఆర్.కృష్ణయ్య, సిహెచ్ ఉదయ్‌భాస్కర్, ఎవిరెడ్డి పలువురు కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-కోట : మండలంలోని శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎంబేటి వెంకట సుబ్బయ్య వికలాంగునికి ట్రైసైకిల్‌ను అందించారు. ఈ మేరకు శనివారం కోట గ్రామంలోని శ్రీశ్రీ కోటమ్మ తల్లి ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి నివాసం వద్ద ఈ ట్రైసైకిల్‌ను బాధితునికి అందజేశారు. నెల్లూరుకు చెందిన బాపూజీ సేవా సమితి నిర్వాహకులు రాజశేఖర్ వర్మ దాతృత్వంతో ఈ ట్రైసైకిల్‌ను అందించినట్లు శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షులు అల్లం రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం సుధాకర్, పన్నగసాయి, ఎంబేటి మణి ఉన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి -తొట్టంబేడు : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగులు సహకరించాలని తొట్టంబేడు మండల వైసీపీ ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామ సచివాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. అక్కడ సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు ఎప్పటికపుడు పరిష్కరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఉద్యోగులు ఆ దిశగా కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు ఎంపిపి ఉన్నం నిర్మలమ్మ, ఉన్నం వాసుదేవనాయుడు, వైస్ ఎంపీపీ గెరటా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కౌశల్ జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌశల్ -2022 జిల్లా స్థాయి పోటీలు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఉమ్మడి వేదిక శ్రీవిద్య డిగ్రీ కాలేజ్ పుత్తూరులో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుత్తూరు, నారాయణవరం మండల విద్యాశాఖ అధికారులు డిగ్రీ కళాశాల ఛైర్మన్ శ్రీ ఉమామహేశ్వరరావు, అపస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాలాజీ, హెచ్‌ఎంఎస్.అసోసియేషన్ అధ్యక్షుడు బి.సి.రాజు, మేకల సుబ్రమణ్యం, కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యం, జిల్లాల కోఆర్డినేటర్లు డి.ధనంజయులు (చిత్తూరు) ఏ.లత(తిరుపతి) పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ టీం మెంబెర్స్ పాల్గొన్నారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కాబడిన ప్రతి జిల్లా నుండి విచ్చేసిన 36 టీములు మొత్తం(72 టీంలు), పోస్టర్ ప్రజెంటేషన్‌లో పాల్గొనే విద్యార్థులు రెండు జిల్లాల నుండి సుమారు 700 మంది ఈ పోటీలో పాల్గొన్నారు. ప్రతి జిల్లా నుండి విచ్చేసిన క్విజ్ టీంలకు ప్రిలిమినరీ, మెయిన్ రౌండ్‌లలో ఆన్లైన్ మాధ్య మంలో క్విజ్‌పోటీ జరిగింది. కాలేజి లెక్చరర్ల ద్వారా పోస్టర్ జడ్జ్‌మెంట్ జరిగింది. చిత్తూరు జిల్లా విజేతలు వివరాలు :క్విజ్‌లో మొదటి బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోనుగూరు, రెండవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జంబాడ, మూడో బహుమతి ఆర్కే ఎస్ ఆర్ హెచ్ ఎస్ కార్వేటినగర పోస్టర్ విన్నెర్స్ వివరాలు1. ఆజాద్ ఇక అమృత మహోత్సవ్ విభాగంలో మొదటి బహుమతి మున్సిపల్ హై స్కూల్ కొత్త ఇండ్లు పుంగనూరు రెండవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టేకుమంద, మూడో బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెదురు కుప్పం జనరల్ పోస్టర్ విభాగంలో మొదటి బహుమతి కే. గాయత్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెదురుకుప్పం రెండవ బహుమతి డి.మాత్యా (జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పలమనేరు) బహుమతి ఏ. శరణ్య (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పుదుపేట.) విజేతలకు సర్టిఫికెట్స్, మెమోంటోస్, ప్రైజ్ మనీ అందచేశారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు డిసెంబర్ 9న విజ యవాడలో జరిగే పోటీలో పాల్గొనాలని తెలిపారు.

ఎన్జీవో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా వేగూరు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: జనవిజ్ఞాన వేదిక అంటే గూడూరు, గూడూరు అంటే జన విజ్ఞాన వేదిక అన్న విధంగా తనదైన శైలిలో సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న గూడూరుకు చెందిన వేగూరు రాజేంద్ర ప్రసాద్ నెల్లూరు సిటీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న వేగూరు రాజేంద్రప్రసాద్ గత కొన్నేళ్లు గా తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు, మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే ఆయన జన విజ్ఞాన వేదిక గూడూరు శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కేవలం మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించ డమే కాక, అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రతి నెల గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రధానమంత్రి మాతత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్న గర్భిణీలు, వారి సహాయకులకు క్రమం తప్పకుండా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పౌష్టికాహార పంపిణీ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ఇలాంటి అనేక కార్యక్రమాలను ఆయన గూడూరు పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఉద్యోగస్తుల సమస్యలపై కూడా ఆయన అలుపెరగని పోరాటం చేస్తున్నారు. వేగూరు రాజేంద్రప్రసాద్ కు సంయుక్త కార్యదర్శిగా పదవి దక్కడంపై పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

చిల్లకూరులో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి- చిల్లకూరు : టిడిపి అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు యూనిట్ ఒకటిన్నర రూపాయికే విద్యుత్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.చిల్లకూరు మండల పరిధిలోని నేషనల్ హైవే పక్కన ఒక ప్రైవేట్ కార్యాలయంలో టిడిపి అధిష్టానం పిలుపు మేరకు 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని నిర్వహించారు.గూడూరు మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. జాతీయ రహదారిపై రెండు నిమిషాల పాటు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆక్వా రైతులు పలువురు తమ కష్టాలను వివరించారు. రొయ్యలను విదేశీ ఎగుమతల్లో 60 శాతం ఎగుమతులు చేస్తూ దేశానికి విదేశీ మారకద్రవ్యం సంపాదించి పెడుతున్న రాష్ట్రంలోని ఆక్వా రైతులను నష్టపరుస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆక్వా రంగాన్ని కుదేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మాజీ మేయర్ అజీజ్, టిడిపి రైతుసంఘం అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకృష్ణ, ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, శ్రీనివాసులురెడ్డి, నరసింహయాదవ్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : 'వైసిపి పాలనలో గడప గడపలో కరెంట్ బిల్లు, ఇంటి పన్నులు, చెత్తపన్నులు షాక్ కొడుతున్నాయని, ప్రజల కష్టాలు తీరాలంటే బాదుడు ప్రభుత్వం పోయి సైకిల్ ప్రభుత్వం రావాలి' అని నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం వడమాలపేట మండలం బాలినాయుడు కండ్రిగ పంచాయతీలో 'మీ కోసం.. మీ తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానా వెంకటయ్య, హేమావతి, ధనంజయులునాయుడు, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో..

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో...

పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

పజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం శనివారం జరిగింది. కళాశాల ప్రిన్సిపా ల్ డాక్టర్ భువనేశ్వరి దేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువులు నేర్పిన విద్యాబుద్ధుల వలనే అనేకమంది ఉన్నతమైన స్థానాల్లో వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నామని అన్నారు సమాజం నిర్దేశం చేసే ప్రప్రథములు గురువులేనని కొనియాడారు. డాక్టర్ వైవి స్వర్ణలత మాట్లాడుతూ జన్మనిచ్చిన ఊరు,విద్య నేర్పిన బడిని మరువరాదని, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాసంస్థల్లో చదవడం గొప్ప వరంగా భావిస్తున్నానని, ఇక్కడ ఉన్న గ్రంథాలయాన్ని చక్కగా వినియోగించుకుని చక్కటి జ్ఞానాన్ని పొందాలని తెలియజేశారు. డాక్టర్ ప్రేమావతి విద్యార్థులనుద్దేశిస్తూ ఇక్కడికి విచ్చేసిన పూర్వ విద్యార్థులకు తాను గురువుగా వీరందరినీ ఆశీర్వదించడం ఆనందదాయకమన్నారు. చివరిగా కళాశాల ప్రిన్సిపాల్ పూర్వ విద్యార్థులనులైన వైవీ స్వర్ణలత, పుష్ప, లలిత, లక్ష్మీదేవి, ప్రమీల, మీనా కుమారి వీరి గురువుగారైన డాక్టర్ ప్రేమావతి ఆధ్వర్యంలో వీరందరికీ దుశ్శాలువలతో సత్కరించి, చిరు జ్ఞాపికలను అందజేశారు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల : తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కర్ణాటక రాష్ట్ర మంత్రి అరవింద్ లింబావలీ, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు..

పక్కాగృహాల పనులు ప్రారంభించాలి : ఎంపీడీఓ

పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ప్రజాశక్తి -బాలాయపల్లి: పక్కాగ్రహాలు పనులను త్వరగా ప్రారంభించాలని ఎంపీడీఓ వినీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చుట్టి గ్రామంలో పక్కా గృహాల బేస్ మట్టం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు ప్రారంభించాలని లబ్ధిదారులతో చెప్పారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య, గ్రామ సర్పంచి సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతులకు వడ్డీ నిధులు మంజూరు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలో 2020-2021 ఆర్థిక సంవత్సరానికి గాను క్రాప్‌లోను క్రింద సున్నా వడ్డీతో లక్ష రూపాయల లోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ నగదు ప్రభుత్వం జమ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాషా తెలిపారు. ఖరీఫ్ సీజన్లో మండల వ్యాప్తంగా పంట రుణాలు తీసుకున్న 358 మంది రైతులు గాను 9.51 లక్షలు, రబీ సీజన్‌కు గాను 352 మందికి గాను 7.58లక్షలు నగదు సున్నా వడ్డీ కింద నిధులు మంజూరు కాగా వీటిని నవంబర్ 28వ తేదీ సోమవారం రైతులు అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తున్నట్లు ఏవో తెలిపారు.

లింగ వివక్షను పారదోలుదాం : ఎపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ : మండల కేంద్రంలోని స్థానిక వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం కేంద్ర ప్రభుత్వం సూచనలతో రాష్ట్ర ప్రభుత్వ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వి.వో లీడర్లు, సంఘమిత్రలతో లింగ వివక్షత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి మండల ఏ.పీ.ఎం మునయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 24వ తేదీ నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు లింగ వివక్షత పై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మొదటి వారం లింగ వివక్షత పై, రెండవ వారం బాల్య వివాహాలు, మూడవ వారం లైంగిక నేరాలు, నాలుగవ వారం గహహింస చట్టాలపై అవగాహన కల్పించి మహిళలపై జరుగుతున్న లింగ వివక్ష దాడులను పారదోలాలని ఆయన కోరారు. అలాగే సి.డి.పి.ఓ శాంతి దుర్గ మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఆడ, మగ అనే తేడా లేకుండా పిల్లలను సరి సమానంగా పెంచాలని తెలిపారు. అలాగే న్యాయవాది గరికపాటి రమేష్ మాట్లాడుతూ మహిళల రక్షణ కొరకు న్యాయస్థానంలో బలమైన చట్టాలు ఉన్నాయని ఎవరూ భయపడవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు.